సాక్షి విశాఖపట్నం

గురువారం । 2 । అక్టోబర్ । 2025

న్యూస్‌రీల్

అప్పన్న సన్నిధిలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తి శ్రీసుధకు అప్పన్న చిత్రపటం అందిస్తున్న ఏఈవో తిరుమలేశ్వరరావు

సింహాచలం: సింహాచలం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి పి.శ్రీసుధ దర్శించుకున్నారు. ఆలయంలో కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందించారు. ఏఈవో తిరుమలేశ్వరావు ఆలయ సంప్రదాయం ప్రకారం ఆమెకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు.

జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారిగా ఉమారాణి



మద్దిలపాలెం: జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారిగా పి.ఉమారాణి నియమితులయ్యారు. ఇంతవరకు ఈ పదవిలో ఉన్న మజ్జి ఆదినారాయణ పదవీ విరమణ చేయగా, ఆయన స్థానంలో ఉమారాణిని నియమిస్తూ ఇంటర్ విద్యాశాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో, ఆమె బుధవారం బాధ్యతలను స్వీకరించారు.

ప్రైవేటు బస్సులపై 14 కేసుల నమోదు



తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం: దసరా పండుగ సందర్భంగా ప్రైవేటు బస్సులు అధిక చార్జీలు వసూలు చేయడం, అనుమతులు లేకుండా నడపడం వంటి పలు నిబంధనల ఉల్లంఘనలపై రవాణా శాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. నాలుగు రోజులుగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు బృందాలుగా ఏర్పడి విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న 14 బస్సులపై కేసులు నమోదు చేసి, రూ.80,000 జరిమానా విధించినట్టు ఇన్‌చార్జ్ ఉప రవాణా కమిషనర్ ఆర్ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు.

విశాఖ–చర్లపల్లి–విశాఖ దసరా స్పెషల్

తాటిచెట్లపాలెం: దసరా సందర్భంగా ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు విశాఖపట్నం–చర్లపల్లి– విశాఖపట్నం మధ్య దసరా స్పెషల్ రైలును నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విశాఖపట్నం–చర్లపల్లి(08589) స్పెషల్ ఈ నెల 3వ తేదీ రాత్రి 7.30గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 10 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. చర్లపల్లి–విశాఖపట్నం(08590) స్పెషల్ ఈ నెల 4వ తేదీ శనివారం రాత్రి 8 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 11.45 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

ఏయూ దూర విద్య.. అక్రమాల అడ్డా

- ప్రైవేటుకు ఏయూ పరీక్ష కేంద్రాలు
- ఇష్టానుసారంగా మంజూరు
- ఒక్కో సెంటర్ నుంచి రూ.5 లక్షల వరకు వసూలు
- కర్నూలు, నంద్యాలలో అక్రమంగా పరీక్ష సెంటర్ల నిర్వహణ
- మాస్ కాపీయింగ్‌కు అడ్డాగా ఏయూ దూర విద్య



ఏయూ దూర విద్యా కేంద్రం

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వ విద్యాలయం దూర విద్యకు చెదలు పట్టింది. అధికారుల హస్తలాఘవానికి కేంద్రంగా మారిపోయింది. పరీక్షా కేంద్రాల పేరుతో అక్రమాలకు అడ్డాగా తయారైంది. ఏయూ దూర విద్య పరీక్షా కేంద్రాల వ్యవహారం ఇపుడు హాట్ టాపిక్‌గా మారింది. అధికారుల పర్యవేక్షణ లోపం, సిబ్బంది చేతివాటం కారణంగా ఎగ్జామినేషన్ సెంటర్లు హద్దులు దాటి ప్రైవేటు చేతికి వెళ్లిపోయాయి. ఈ ప్రైవేటు సెంటర్లు ఒక పేరుతో అనుమతి పొంది మరోచోట పరీక్షలు నిర్వహిస్తున్నా.. అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ప్రధానంగా ఈ పరీక్షల నిర్వహణపై కూడా అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అనధికార కేంద్రాలు మాస్ కాపీయింగ్‌కు నిలయాలుగా మారిపోయాయి. ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే దూర విద్య పరీక్షా కేంద్రాలు నిర్వహించాలని ఏయూ పాలకులు నిర్ణయం తీసుకున్నప్పటికీ.. కొన్ని లొసుగులతో ఇప్పటికీ ప్రైవేటుకే పెద్ద పీట వేస్తున్నారు.

సెంటర్‌కు రూ.2 నుంచి రూ.5 లక్షలు

ఏయూ పరీక్షా కేంద్రాలను ఇష్టానుసారంగా ప్రైవేటుకు అప్పగించేశారు. ప్రైవేటు సెంటర్లలో మాస్ కాపీయింగ్ జరిగిన సందర్భాలు అనేకమున్నాయి. అయినప్పటికీ పరిధి దాటి అనంతపురం, కర్నూలు, నంద్యాల, హైదరాబాద్‌లలో కూడా ప్రైవేటు విద్యా కేంద్రాలకు పరీక్షా కేంద్రాల నిర్వహణకు అనుమతులు మంజూరు చేసేశారు. ఇటువంటి సెంటర్లపై ఎన్ని ఫిర్యాదు వచ్చినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రతి సెంటర్ నుంచి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు తీసుకుని అనుమతులు మంజూరు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ తర్వాత వాటి పర్యవేక్షణ మాత్రం గాలికి వదిలేస్తున్నారు.

ప్రైవేటు కేంద్రాలు రద్దు చేయాలని నిర్ణయించినా..

ఏయూ దూర విద్య పరీక్షల నిర్వహణపై అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ప్రైవేటు పరీక్షా కేంద్రాల అనుమతులు రద్దు చేయాలని రెండేళ్ల క్రితమే ఏయూ అధికారులు నిర్ణయించారు. కేవలం ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే ఈ పరీక్షలను నిర్వహించాలని భావించారు. కానీ అధికారుల బదిలీలు.. సిబ్బంది చేతివాటం.. ప్రైవేటు మామూళ్లతో ఇప్పటి వరకు ఆ నిర్ణయాన్ని అమలు చేయలేదు. ఇప్పటికీ ఆంధ్రాలోనే కాకుండా తెలంగాణలో కూడా ఏయూ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ పరీక్షలు ప్రైవేటు సెంటర్లలో నిర్వహిస్తూనే ఉన్నారు. గత నిర్ణయాలను మాత్రం అమలు చేయడానికి వెనకడుగు వేస్తున్నారు. ఆదాయం పోతుందన్న కారణంగానే ప్రైవేటు సెంటర్లను ప్రోత్సహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మాస్ కాపీయింగ్‌కు కేంద్రాలుగా...

ఏయూ దూర విద్య పరీక్షా కేంద్రాలుగా ఉన్న కొన్ని ప్రైవేటు సెంటర్లు అనధికారికంగా మరి కొన్ని చోట్ల ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రత్యేకంగా పరీక్షా కేంద్రాలను నిర్వహించి అక్కడ విద్యార్థులతో పరీక్షలు రాయించి వాటిని అనుమతి పొందిన కేంద్రాల్లో నిర్వహించినట్లు చూపిస్తున్నారన్న వార్తలు గుప్పుమంటున్నాయి. గత నెల 12వ తేదీ కర్నూలు, అనంతపురం జిల్లాల్లో ఇదే తరహాలో అనధికారికంగా పరీక్షలు నిర్వహించిన ట్లు సమాచారం. మరికొంత మంది ఇతర జిల్లాల్లో అనధికారికంగా పరీక్షలు రాయించి ఉత్తరాంధ్రలో ప్రభుత్వ విద్యా సంస్థలో ఉన్న కేంద్రాల్లో పరీక్షలు రాసినట్లు చూపిస్తున్నారని, ఇందుకు దూర విద్యా విభాగం సిబ్బంది కూడా సహాయ సహకారాలు అందిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.



దసరా శోభ

శ్రీ కనకమహాలక్ష్మి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారు..బుధవారం మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. పలు రకాల తాజా కూరగాయలతో అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. అలాగే దసరా సందర్భంగా నగరమంతా సందడిగా మారింది. ప్రధాన మార్కెట్లు కళకళలాడాయి.



సైబర్ మోసాలపై అప్రమత్తం

బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: ప్రజల్లో ఆర్థిక అక్షరాస్యతను మరింత పెంచాలని, సైబర్ మోసాలపై అప్రమత్తం చేయాలని జిల్లాలోని వివిధ బ్యాంకుల ప్రతినిధులను ఉద్దేశించి కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో జరిగిన జూన్ క్వార్టర్ బ్యాంకర్ల జిల్లాస్థాయి సమీక్షా కమిటీ సమావేశంలో ఆయన పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్, అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన శిబిరాలు, ర్యాలీలు నిర్వహించాలని చెప్పారు. అధిక మొత్తంలో ఆర్థిక లావాదేవీలు జరిగే సమయంలో బ్యాంకర్లు సునిశిత పరిశీలన చేయాలని, అనుకోని రీతిలో ఎవరైనా ఒత్తిడికి గురైనా, సందేహాస్పద వ్యవహారశైలి ఉన్నా గమనించి తగిన చర్యలు చేపట్టాలని, ఆపదలో ఉన్నవారికి సహకారం అందించాలని పేర్కొన్నారు. విశాఖలో ఇటీవల జరిగిన పలు ఘటనలను సోదాహరణంగా వివరిస్తూ బ్యాంకర్లు ప్రజలకు ఇలాంటి విషయాల్లో అండగా నిలవాలని హితవు పలికారు. సామాన్యులు, రైతుల ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని, సులభతర విధానంలో రుణాలు మంజూరు చేయాలని సూచించారు. స్వయం ఉపాధి నిమిత్తం వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే వారికి పూర్తిస్థాయి సహకారం అందించాలన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా చేపట్టబోయే ప్రాజెక్టులకు బ్యాంకులు మద్దతు తెలిపాలని, కొత్త కొత్త ప్రాజెక్టులతో వచ్చే వారికి సహకారం అందించాలని సూచించారు. సమావేశంలో భాగంగా, ముందుగా గత క్వార్టర్‌లో నిర్వహించిన సమావేశం తాలూకు లక్ష్యాలను, ఫలితాలను విశ్లేషించారు. జూన్ క్వార్టర్‌లో చేపట్టాల్సిన కార్యాచరణపై అధికారులకు, బ్యాంకర్లకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. రుణాల నిమిత్తం ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిశీలించి చర్యలు చేపట్టాలన్నారు. గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా కేంద్రాల కార్యకలాపాలను పెంచాలని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని అధికారులకు చెప్పారు. ఎల్డీఎం శ్రీనివాసరావు, ఆర్బీఐ ప్రతినిధులు, వివిధ బ్యాంకుల మేనేజర్లు, పలు శాఖల జిల్లా స్థాయి అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ

మహారాణిపేట: జిల్లాలో ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ చేసిన ఏర్పాట్ల మధ్య, ఉదయం 6 గంటలకు ప్రారంభమైన ఈ పంపిణీ రాత్రి 7 గంటల సమయానికి 93.85 శాతానికి చేరుకుంది. జిల్లాలో మొత్తం 1,60,200 పింఛన్‌దారులున్నారు. రాత్రి 7 గంటల నాటికి 1,50,344 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. మిగిలిన పింఛన్లను శుక్రవారం పంపిణీ చేస్తామని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీపతి తెలిపారు.

మెడికల్ షాపుల్లో తనిఖీలు

- 43 షాపుల పరిశీలన
- జీఎస్టీ అమలు చేయని వారిపై కఠిన చర్యలు
- అసిస్టెంట్ డైరెక్టర్ విజయకుమార్ హెచ్చరిక

సాక్షి ఎఫెక్ట్..

మహారాణిపేట: జీఎస్టీ తగ్గింపు ధరలను మెడికల్ షాపులు ఎక్కడా అమలు చేయడం లేదంటూ బుధవారం 'సాక్షి'లో మందులపై 'జీఎస్టీ' మతలబు శీర్షికతో ప్రచురించిన కథనంపై ఔషధ నియంత్రణ శాఖ స్పందించింది. జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్. విజయకుమార్ ఆధ్వర్యంలో బుధవారం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని మెడికల్ షాపులపై విస్తృత తనిఖీలు నిర్వహించారు. మహారాణిపేట, మధురవాడ, ఎంవీపీ కాలనీ, ఆరిలోవ, గాజువాక, చిన్నగంట్యాడ, కుర్మన్నపాలెం, అనకాపల్లి, కొంకోట వంటి ప్రాంతాల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు దాడులు చేశారు. మొత్తం 43 మెడికల్ షాపులలో తనిఖీలు చేపట్టారు. సాక్షిలో కథనం రాగానే కొన్ని షాపులు జీఎస్టీ తగ్గింపు ధరలను తెలియజేసే సైన్ బోర్డులను ప్రదర్శించాయి. అసిస్టెంట్ డైరెక్టర్ విజయకుమార్ స్వయంగా పెదవాల్తేరు, చిన్నవాల్తేరు ఏరియాల్లోని 11 షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ షాపుల్లో ఎక్కడా జీఎస్టీ ధరల బోర్డులు ఏర్పాటు చేయకపోవడాన్ని గమనించారు. తక్షణమే బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయన డ్రగ్గిస్టులను ఆదేశించారు. జీఎస్టీ నిబంధనలతో మాత్రమే మందులను విక్రయించాలని మెడికల్ షాపుల యజమానులను ఆదేశించారు. మందులను కొనుగోలు చేసినప్పుడు వినియోగదారులు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా జీఎస్టీ సైన్ బోర్డులు లేకపోయినా, జీఎస్టీ తగ్గింపు ధరలకు అమ్మకాలు జరగకపోయినా డీఆర్‌సీ నంబర్ 863233 0909కు గాని, లేదా dca-grams@ap.gov.inకు ఫిర్యాదు చేయాలని కోరారు.



మెడికల్ షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

భారీ వర్ష సూచన

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

మహారాణిపేట: జిల్లాలో శుక్రవారం వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రజల రక్షణ, సహాయక చర్యల కోసం జిల్లా యంత్రాంగం కీలక చర్యలు చేపట్టింది. అందులో భాగంగా కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ కంట్రోల్ రూమ్ 24 గంటలు పనిచేస్తుంది. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్ రూంలో నంబర్లను సంప్రదించవచ్చు. కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ 0891-2590100, 0891-2590102, ఆర్డీవో కార్యాలయం 85008 34958, భీమిలి ఆర్డీవో కార్యాలయం 80744 25598 సంప్రదించాలని జిల్లా రెవెన్యూ అధికారి బీ.హెచ్.భవానీ శంకర్ తెలిపారు.

భలే మందుస్తు ఏర్పాట్లు



అక్కయ్యపాలెంలో మద్యం దుకాణం వద్ద

దసరా వచ్చిందంటే చాలు... చాలామందికి మందు, ముక్క లేకుండా పండగ అస్సలు మొదలైనట్టే కాదు.. ఈ రెండూ ఉంటేనే ఆ రోజుకి అసలు 'జోష్' వచ్చినట్టు. ఈ ఏడాది అసలు ట్విస్ట్ ఏంటంటే... దసరా పండగ సరిగ్గా గాంధీ జయంతి రోజునే వచ్చింది. 'నియమం' ప్రకారం, ఈ శుభదినాన ప్రభుత్వం మద్యం దుకాణాలు, మాంసం దుకాణాలు రెండింటికీ సెలవు ప్రకటించింది. అంటే పండగ రోజున మందు బాబుల 'హోమ్ డెలివరీ'కి కూడా దారి లేదన్నమాట..'ఏం? పండగని ఆపేస్తారా? మా ఆనందాన్ని ఆపగలరా?' అంటూ మద్యం ప్రియులు రంగంలోకి దిగారు. గురువారం షాపులు మూతపడతాయని తెలియగానే, బుధవారాన్ని వాళ్లు 'అంతర్జాతీయ అత్యవసర నిల్వల దినోత్సవం' గా మార్చేశారు. వైన్‌షాపుల ముందు క్యూ చూస్తే, అంతా తమ ఇళ్లలో కనీసం నెల రోజులకు సరిపడా 'ద్రవ్య నిల్వలు' పెట్టుకోవడానికి వచ్చినట్టు అనిపించింది. వీళ్ల ప్రణాళిక చూసి చాలా మంది ముక్కున వేలేసుకున్నారు. వైన్‌షాపుల ముందు గుమిగూడిన జనాన్ని చూసి, పక్కన ఉన్నవాళ్లంతా దసరా జోష్ అంటే ఇదే కదా.. అంటూ చమత్కరించారు. ఇక మాంసం దుకాణాల వద్ద రద్దీ అయితే ఇంకో లెవల్.. మటన్, చికెన్ ముక్కలు కొని, పాడవకుండా ఉండేందుకు 'ఐస్ క్యూబ్ ప్లానింగ్' ఎలా చేయాలో ఒకరికొకరు సలహాలు ఇచ్చుకున్నారు. 'ముక్కను ఫ్రిజ్‌లో దాచడం ఒక కళ, దాన్ని సేఫ్‌గా పండగ రోజు వరకూ ఉంచడం ఒక విజ్ఞానం' అంటూ డిస్కషన్లు పెట్టుకున్నారు. –సీతంపేట

పల్లె వైద్యంపై సమ్మె ప్రభావం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు తమ డిమాండ్ల సాధన కోసం సమ్మెలోకి దిగడంతో పల్లె ప్రాంతాల్లో వైద్య సేవలు పూర్తిగా పడకేశాయి. దీని ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. పీహెచ్‌సీ వైద్యులు తమ సమస్యల పరిష్కారం కోసం గత నెల 26వ తేదీ నుంచే ఆందోళన కార్యక్రమాలను ప్రారంభించారు. ప్రభుత్వ వైద్యులు ప్రధానంగా జీవో నం. 99 ద్వారా కోత విధించిన ఇన్–సర్వీస్ పీజీ కోటా పునరుద్ధరణ, పదోన్నతుల కల్పన, గిరిజన అలవెన్స్‌లు, 104 సంచార చికిత్స అలవెన్స్‌ల అమలు వంటి డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారు. ఇవి పరిష్కారం కాకపోవడంతో సమ్మె బాట పట్టారు.

- గత నెల 26 నుంచి సమ్మెలోకి పీహెచ్‌సీ వైద్యులు
- విధులకు దూరంగా 20 మంది డాక్టర్లు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న గర్భిణులు

మహారాణిపేట: సమ్మెలో భాగంగా జిల్లాలోని పది పీహెచ్‌సీల్లో 20 మంది వైద్యులు సమ్మె బాట పట్టారు. ఇందులో భీమిలి, రేవిడి, ఆర్.తాళ్లవలస, ఆనందపురం, శొంఠ్యాం, మధురవాడ, కణితదేవాడ, గాజువాక, పెదగంట్యాడ వంటి ప్రాంతాల వైద్యులు ఉన్నారు. గత నెల 29 నుంచి వైద్యులు ఔట్ పేషెంట్ సేవలను పూర్తిగా బహిష్కరించారు. అంతకుముందు 26వ తేదీ నుంచి నల్ల బ్యాడ్జీలు ధరించడంతో పాటు, అధికారిక కార్యక్రమాలు, రోగుల పేర్ల నమోదు ప్రక్రియ మరియు అధికారిక వాట్సప్ గ్రూప్‌ల నుంచి బయటకు వచ్చారు. గత నెల 26 నుంచి ఆన్‌లైన్‌లో రోగులు, వారి వివరాలను నమోదు చేయకుండా నిలిపివేశారు. దీనివల్ల ప్రతిరోజు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు పంపాల్సిన ముఖ్యమైన ఆరోగ్య సమాచారం నిలిచిపోయింది. 'స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్' కింద జరుగుతున్న నేషనల్ కమ్యూనికబుల్ డిసీజెస్ 4.0 సర్వే, క్యాన్సర్ స్కానింగ్ పరీక్షలను కూడా బహిష్కరిస్తున్నట్లు యూనియన్ నేత డాక్టర్ జగదీష్ తెలిపారు. సంచార చికిత్సలు, ఇతర మెడికల్ క్యాంపుల నుంచి కూడా వైద్యులు దూరంగా ఉంటున్నారు.

రేపు విజయవాడలో దీక్షలు

అత్యవసర వైద్య సేవల్లో భాగంగా కేవలం డెలివరీలు, పాము కాటు, పాయిజనింగ్ కేసులకు మాత్రమే ఇంతవరకు చికిత్సలు అందించారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే శుక్రవారం విజయవాడలో రిలే నిరాహార దీక్షలు చేస్తామని అసోసియేషన్ నాయకుడు డాక్టర్ జగదీష్ ప్రకటించారు.

నర్సులే డాక్టర్లు

కొన్ని పీహెచ్‌సీల్లో వైద్యులు లేకపోవడంతో నర్సులు, ఫార్మసిస్టులు వైద్యుల అవతారం ఎత్తి రోగులను చూస్తున్నారు. గ్రామాల్లో సంచార వైద్య సేవలు నిలిచిపోవడంతో, రోగులు స్థానికంగా ఉండే ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. పరిస్థితి సీరియస్‌గా ఉంటే విశాఖ నగరానికి పరుగులు తీయాల్సి వస్తోంది. ప్రభుత్వం వెంటనే స్పందించి, వైద్యుల డిమాండ్లను పరిష్కరించి, గ్రామీణ ప్రజలకు నిరాటంకంగా వైద్య సేవలు అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ఆందోళన

తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామీణ వైద్యులు బుధవారం సాయంత్రం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. తమ దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని, ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ డిమాండ్లను నెరవేర్చాలని వైద్యులు ఈ సందర్భంగా నినాదాలు చేశారు. ప్రభుత్వ విధానాల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు సక్రమంగా అందించలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. డిమాండ్లు పరిష్కరించే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని వైద్యులు స్పష్టం చేశారు.



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

రోగుల పడిగాపులు

వైద్యులు సమ్మెలోకి వెళ్లడంతో గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీలు వెలవెలబోతున్నాయి. రోజుకు 74 నుంచి 140 మంది వరకు ఓపీ నమోదు అయ్యే కేంద్రాలు నేడు బోసిపోయి, వైద్యుల కుర్చీలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. వైద్యం కోసం వచ్చిన రోగులు, ముఖ్యంగా గర్భిణులు, తీవ్ర అవస్థలు పడుతూ పడిగాపులు కాస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ కొందరు వైద్యులను ప్రత్యామ్నాయంగా నియమించినప్పటికీ, వారు గత వైద్యుల వలే పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండడం లేదు. ఏదో మొక్కుబడిగా సేవలు అందిస్తున్నారు.

దసరా.. ధరల జోరు..

కిటకిటలాడిన మార్కెట్లు.. • చుక్కలనంటిన పూల ధరలు

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని నగరం దసరా శోభను సంతరించుకుంది. పండగ పూజలకు అవసరమైన సామగ్రి కొనుగోలు చేసేందుకు నగర వాసులు మార్కెట్లకు పోటెత్తడంతో బుధవారం బజార్లన్నీ కిటకిటలాడాయి. అయితే ఈ పండగ ధరల భారం స్పష్టంగా కనిపించింది. ముఖ్యంగా పూజా సామగ్రి, పువ్వులు, పండ్ల ధరలు ఆకాశాన్నంటడంతో సామాన్యుడి జేబుకు చిల్లు పడింది. ఒకవైపు నగరంలోని ప్రధాన మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడితే.. శివారు ప్రాంతాల్లో కురిసిన వర్షం వ్యాపారులను నిరాశకు గురి చేసింది.





అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్డులో రద్దీ

జగదాంబ/డాబాగార్డెన్స్/తగరపువలస: విజయదశమి సందర్భంగా నగరంలోని పూర్ణామార్కెట్, కురుపాం మార్కెట్, అల్లిపురం, దండుబజార్, అక్కయ్యపాలెం, గాజువాక వంటి ప్రధాన మార్కెట్లన్నీ కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ఉదయం కాస్త సాధారణంగా ఉన్నా.. సాయంత్రం 4 గంటల తర్వాత జనాల రద్దీ ఒక్కసారిగా పెరిగింది. పూజా సామగ్రి కోసం వచ్చిన జనంతో మార్కెట్ లోపల, బయట వెలిసిన దుకాణాలు నిండిపోయాయి. గతంలో రూ.200 తీసుకెళ్తే సంచి నిండా సరకులు వచ్చేవని, ఇప్పుడు రూ.500 పెట్టినా సంచి నిండడం లేదని



అక్కయ్యపాలెంలో పువ్వుల కొనుగోలు

వినియోగదారులు వాపోయారు. ధరల పెరుగుదల తీవ్రతకు ఇది అద్దం పడుతోంది. ముఖ్యంగా పువ్వుల ధరలు భగ్గుమన్నాయి. కిలో బంతి పువ్వులు రూ.250, చామంతి రూ.500కు చేరాయి. వాహనాలకు కట్టే పూల దండలు రూ.300 నుంచి రూ.500 వరకు విక్రయించారు. నాణ్యత, పరిమాణాన్ని బట్టి ఒక్కో కొబ్బరికాయ రూ.40 నుంచి రూ.70 వరకు అమ్మారు. డజను అరటిపండ్లు రూ.70 నుంచి రూ.100 వరకు విక్రయించారు. నగరంలో రూ.20కి కేవలం మూడు నిమ్మకాయలు అమ్మగా, కొన్నిచోట్ల వాహన పూజల కోసం రూ.20కి ఆరు కాయలు విక్రయించారు. పసుపు, కుంకుమ, కర్పూరం, అగరబత్తి వంటి ఇతర సామగ్రి కొనాలంటే కనీసం రూ.100 ఖర్చు చేయాల్సి వచ్చింది. చివరికి మామిడి ఆకుల కొమ్మలు కూడా రూ.20కి అమ్మడం గమనార్హం. పూర్ణామార్కెట్‌లో ఈ సారి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

పూర్ణామార్కెట్‌కు పోటెత్తిన కొనుగోలుదారులు

ట్రాఫిక్‌ను వన్ వేలో మళ్లించడం ద్వారా వినియోగదారులు సులభంగా కొనుగోళ్లు జరుపుకోగలిగారు. జేబు దొంగల పట్ల పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

శివారు మార్కెట్లపై వర్షం ఎఫెక్ట్

నగర కేంద్రంలో పరిస్థితి ఇలా ఉంటే.. తగరపువలస, ఆనందపురం వంటి శివారు ప్రాంతాల్లో బుధవారం మధ్యాహ్నం నుంచి కురిసిన కుండపోత వర్షం వ్యాపారుల ఆశలపై నీళ్లు చల్లింది. రహదారులు జలమయమై, బురదగా మారడంతో వినియోగదారులు మార్కెట్లకు రాలేకపోయారు. దీంతో పూజా సామగ్రి, పండ్లు, కూరగాయల వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు. పూజా సామగ్రి ధరలు పెరిగినప్పటికీ, దసరా సందర్భంగా ఎలక్ట్రానిక్ వస్తువులు, గృహోపకరణాలపై జీఎస్టీ తగ్గడంతో వాటి



వర్షం కారణంగా వెలవెలబోయిన వేములవలస మార్కెట్



నిమ్మకాయల విక్రయాలు



పూర్ణామార్కెట్‌లో కొబ్బరికాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

కొనుగోళ్లకు ఆసక్తి చూపారు. కొత్త దుస్తులు, బంగారం కొనుగోలు చేసేందుకు కూడా జనం షాపింగ్ మాళ్లకు పోటెత్తారు.

నగర ప్రజలపై దుర్గామాత ఆశీస్సులుండాలి



డాబాగార్డెన్స్: ఆది పరాశక్తిగా, జగన్మాతగా, శక్తి స్వరూపిణిగా కొలిచే దుర్గామాత ఆశీస్సులు నగర ప్రజలపై ఉండాలని మాజీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. విజయదశమి పర్వదినాన ప్రజలందరికీ గొప్ప విజయాలు అందాలని ఆకాంక్షించారు. నగర ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

మహాలక్ష్మిగా కనకమహాలక్ష్మి



హారతులందుకుంటున్న కనకమహాలక్ష్మి భక్తులు

డాబాగార్డెన్స్: శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానం శరన్నవరాత్రి మహోత్సవాలతో ఆధ్యాత్మిక కాంతులీనుతోంది. ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు భక్తులను మహాలక్ష్మి అలంకరణలో కటాక్షించారు. పలు రకాల తాజా కూరగాయలతో అమ్మవారిని శాకంబరిగా అలంకరించి వేదపండితులు శాస్త్రోక్తంగా సహస్రనామార్చన నిర్వహించారు. నగరానికి చెందిన భక్తులు ఒ.నరేష్‌కుమార్, రాధిక కుటుంబ సభ్యులు రూ.45 వేలు చెల్లించి ఈ పూజలో పాల్గొన్నారు. అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. గురువారం అమ్మవారు స్వర్ణకవచాలంకరణలో దర్శనమివ్వనున్నారని, 108 స్వర్ణపుష్పాలతో ప్రత్యేక పుష్పార్చన నిర్వహిస్తామని ఈవో శోభారాణి తెలిపారు.

పద్మావతిగా కన్యకాపరమేశ్వరి

డాబాగార్డెన్స్: పాతనగరం కురుపాం మార్కెట్ సమీపంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 10వ రోజు బుధవారం కన్యకాపరమేశ్వరి పద్మావతిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థాన ప్రధాన అర్చకుడు ఆర్‌బీబీ కుమార్‌శర్మచే సామూహిక కుంకుమ పూజలు



పద్మావతిగా భక్తులకు దర్శనమిస్తున్న కన్యకాపరమేశ్వరి

నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన వాసవీ కనకదుర్గాదేవికి ప్రత్యేక కుంకుమ పూజలు, హోమం చేశారు. సత్యవతి, వెంకటేశ్వర సుందరకాండ గ్రూప్‌చే సుందరకాండ గానం భక్తులను అలరించింది. గురువారం కన్యకా పరమేశ్వరి విజయదుర్గాదేవిగా దర్శనమివ్వనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.



భీమిలి శివారులో పంచదార చిలకల అలంకరణలో..

అప్పన్న జమ్మివేటకు సర్వం సిద్ధం



పూలతోట వ్యూ

సింహాచలం: విజయదశమిని పురస్కరించుకుని గురువారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జమ్మివేట ఉత్సవం జరగనుంది. కొండదిగువ పూలతోటలో జరిగే ఈ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి రామాలంకారం చేసి మధ్యాహ్నం 3.30 గంటలకు సింహగిరి నుంచి కొండదిగువకు మెట్లమార్గంలో తీసుకొస్తారు. కొండదిగువ పూలతోటలో ఉన్న మండపంలో స్వామిని అధిష్ఠింపజేసి విశేషంగా పూజలు నిర్వహిస్తారు.



అప్పన్న ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి(ఫైల్)

పూలతోటలోనే ఉన్న జమ్మిచెట్టు వద్ద శమీపూజ నిర్వహిస్తారు. తదుపరి, స్వామికి అడవివరం గ్రామ పురవీధుల్లో అశ్వవాహనంపై తిరువీధి నిర్వహిస్తారు. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు పూలతోటను పెద్ద ఎత్తున ముస్తాబు చేశారు. పెద్ద ఎత్తున విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. గోపాలపట్నం పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. కాగా, జమ్మివేట ఉత్సవం సందర్భంగా గురువారం సాయంత్రం 6 గంటల వరకే సింహగిరిపై స్వామి వారి మూలవిరాట్ దర్శనాలు లభిస్తాయి.





యూరియా ఎర

- పెదగాడిలో యూరియా రగడ
- జీఎస్టీ ప్రచారానికి వస్తే యూరియా ఇస్తామన్న కూటమి నాయకులు
- అనంతరం యూరియా ఇవ్వకుండా వెనక్కి పంపిన వైనం
- అధికారులు, నాయకుల తీరుపై మండిపడ్డ మొగలిపురం రైతులు



పెదగాడి రైతు కేంద్రం యూరియా కోసం వద్ద వ్యవసాయాధికారులకు, రైతుల మధ్య వాగ్వాదం

పెందుర్తి: అధికార కూటమి నాయకులు ప్రచార యావతో యూరియాను ఎరగా చూపించి మోసం చేయడంతో ఒక గ్రామానికి చెందిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంపై అవగాహన సదస్సు కోసం బుధవారం పెందుర్తి మండలం పెదగాడి రైతు సేవా కేంద్రం వద్ద చేపట్టిన కార్యక్రమంలో ఈ వివాదం చోటు చేసుకుంది. కూటమి ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై అవగాహన సదస్సు, ర్యాలీ కోసం పెదగాడి, పినగాడితో పాటు, పినగాడి రెవెన్యూ పరిధిలో భూములు ఉన్న సబ్బవరం మండలం మొగలిపురానికి చెందిన రైతులను కూటమి నాయకులు ఆహ్వానించారు.

సదస్సు, ర్యాలీకి వచ్చిన ప్రతీ రైతుకు యూరియా ఇస్తామని నాయకులు నమ్మబలికారు. అసలే యూరియా కొరతతో ఇబ్బంది పడుతున్న మొగలిపురం రైతులు.. ఈ హామీతో సదస్సుకు ఉత్సాహంగా హాజరయ్యారు.

తీరా జీఎస్టీపై ప్రచారం పూర్తయిన తరువాత, పెదగాడికి చెందిన కూటమి నాయకులు తమకు నచ్చిన కొందరి పేర్లను అధికారులకు చెప్పి, వారికి మాత్రమే యూరియా ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో మొగలిపురం రైతులకు పెదగాడి క్లస్టర్‌లో యూరియా ఇవ్వలేమని అధికారులు తేల్చిచెప్పారు.

రైతులు, అధికారుల మధ్య వాగ్వాదం

దీంతో రైతులు, అధికారుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. మండలం పరంగా సబ్బవరం అయినప్పటికీ, తమ భూములు పినగాడి రెవెన్యూలోనే ఉన్నాయని రైతులు వివరించారు. పినగాడి రెవెన్యూ పరిధిలో ఉన్న వారికి ఇస్తామని చెప్పి, అదే ప్రాంతంలో



వ్యవసాయాధికారులను నిలదీస్తున్న రైతులు

భూములు ఉన్న తమకు ఎరువు ఇవ్వకపోవడమేంటని నిలదీశారు. అదే సమయంలో యూరియా నిల్వలు కూడా అయిపోవడంతో చేసేది లేక, కూటమి నాయకుల తీరుపై తీవ్రంగా మండిపడుతూ మొగలిపురం రైతులు వెనుదిరిగారు. 'యూరియా సరిపడా అందించడంలో విఫలమై, చివరకు చిన్నపాటి ప్రచారానికి మాయమాటలు చెప్పి మమ్మల్ని తరలించారు. ఇలా ఉసూరుమనిపించడం తగదు' అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని వారు స్పష్టం చేశారు.

నిర్మాణ సంస్థకు వినియోగదారుల కమిషన్ షాక్

విశాఖ లీగల్: వినియోగదారుడికి సేవా లోపం కలిగించినందుకు పరిహారం చెల్లించాలని నగరంలో వినియోగదారుల పరిష్కార కమిషన్–2 అధ్యక్షురాలు జి.వెంకటేశ్వరి, సభ్యులు రమణబాబు, విజయదుర్గ తీర్పునిచ్చారు. ఫిర్యాది నుంచి తీసుకున్న సొమ్మును వడ్డీతో సహా వాపస్ చేయాలని, అదనంగా లక్ష రూపాయల పరిహారం చెల్లించాలని కూడా వారు తమ తీర్పులో స్పష్టం చేశారు. ఫిర్యాది తరఫు న్యాయవాది ఎస్.ఎస్.ఎస్.జగన్నాథరావు బుధవారం తెలిపిన వివరాలివి. చినగంట్యాడ ప్రాంతానికి చెందిన ఎస్.శేషుకుమారి 2019లో బీహెచ్‌పీవీ ప్రాంతానికి చెందిన డి.డి. నిర్మాణ సంస్థ నుంచి నాలుగు లక్షల 50 వేల రూపాయలకు ఇంటి స్థలాన్ని కొనుగోలు చేశారు. అదే సంస్థతో ఆ స్థలంలో ఇంటిని సంవత్సర కాలంలో నిర్మించి అప్పగించడానికి రూ.11,82,000కు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒప్పందంలో భాగంగా ఫిర్యాది పలు దఫాలుగా రూ.10,24,900 చెల్లించారు. మూడేళ్లు గడిచినప్పటికీ.. ప్రతివాది రూ.7,15,018 విలువ కలిగిన నిర్మాణ పనులను మాత్రమే పూర్తి చేశారు. రూ.3,09,991 విలువ చేసే పనులు ఇంకా చేయవలసి ఉంది. లీగల్ నోటీసు జారీ చేసినా ప్రయోజనం లేకపోవడంతో ఫిర్యాది వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించారు. ఇరు పక్షాల వాదనలు, సాక్ష్యాధారాలను పరిశీలించిన కమిషన్.. ప్రతివాది సేవా లోపాన్ని గుర్తించి, పై విధంగా తీర్పునిచ్చింది.

మత్స్యకారులకు లబ్ధి చేకూరేలా ప్రణాళికలు

అధికారులకు కలెక్టర్ ఆదేశం

మహారాణిపేట: ప్రతి మత్స్యకారుడికి లబ్ధి చేకూరే విధంగా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టర్ చాంబర్‌లో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథక జిల్లా స్థాయి కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ పథకానికి సంబంధించి కొత్తగా లబ్ధిదారుల ఆమోదంపై చర్చించి.. బోట్లు, ఇంజన్లు, వలలు, ట్రాన్స్‌పాండర్లు, టిడ్ యూనిట్లను ప్రతిపాదించారు. బ్యాక్‌యార్డ్ ఆర్నమెంటల్ హ్యాచరీలు, సీ–వీడ్ పెంపకంపై దృష్టి సారించాలని మత్స్యశాఖ జేడీ లక్ష్మణరావును కలెక్టర్ ఆదేశించారు. సమావేశం అనంతరం తిమ్మాపురం మహిళా మత్స్యకార సంఘానికి విశాఖపట్నం పోర్ట్ సీఎస్సార్ నిధులతో సమకూర్చిన చేపల



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, చిత్రంలో వివిధ శాఖల అధికారులు

రవాణా వాహనాన్ని కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. జెడ్పీ సీఈవో నారాయణ మూర్తి, జిల్లా వ్యవసాయ అధికారి అప్పలస్వామి, ప్రధాన శాస్త్రవేత్త డా.జోయి, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు, సత్యారావు, ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, డీఆర్‌డీఏ అధికారులు హాజరయ్యారు.



బీచ్‌రోడ్డులోని కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం బుధవారం పర్యాటకులతో కిటకిటలాడింది. నగరం నుంచే కాకుండా, ఇతర ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలివచ్చి మ్యూజియాన్ని తిలకించారు. -ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

'క్యూ'రుసుర.!

సీఎం చంద్రబాబుకు స్వాగతం



సీఎంకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, సీపీ బాగ్చీ

మహారాణిపేట: ముఖ్యమంత్రి చంద్రబాబుకు విశాఖ ఎయిర్‌పోర్టులో ప్రజా ప్రతినిధులు, అధికారులు స్వాగతం పలికారు. విజయనగరంలో జరిగే పింఛన్ల పంపిణీ, ప్రజావేదిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరిన ఆయన.. ట్రాన్సిట్ హాల్ట్‌లో భాగంగా బుధవారం ఉదయం విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఎంపీ శ్రీభరత్, ప్రభుత్వ విప్ గణబాబు, ఎమ్మెల్యేలు, సీఎంవో కార్యదర్శి ప్రద్యుమ్న, కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సీఎం హెలికాప్టర్‌లో విజయనగరం బయలుదేరి వెళ్లారు.

ఏపీఈపీడీసీఎల్‌లో పలువురికి పదోన్నతులు

తాటిచెట్లపాలెం: ఏపీఈపీడీసీఎల్‌లో పలువురు ఇంజినీర్లకు చీఫ్ జనరల్ మేనేజర్లుగా పదోన్నతులు లభించాయి. ఎనర్జీ కన్జర్వేషన్ అండ్ సోలార్ ఎనర్జీ విభాగం చీఫ్ జనరల్ మేనేజర్‌గా ఎల్ దైవప్రసాద్, పర్చేజెస్ అండ్ మెటీరియల్స్ విభాగం చీఫ్ జనరల్ మేనేజర్‌గా ఎస్ విజయ్‌ప్రతాప్‌లకు పదోన్నతులు లభించాయి. కమర్షియల్ విభాగం చీఫ్ జనరల్ మేనేజర్‌గా ఎస్.రాజబాబు, సీజీఆర్ఎఫ్ టెక్నికల్ మెంబర్‌గా బి.సులేఖ రాణిలకు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్‌లను సీఎండీ పృథ్వీతేజ్ సోమవారం జారీ చేశారు. బుధవారం విశాఖపట్నం కార్పొరేట్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఎల్.దైవప్రసాద్, బి.సులేఖరాణి, ఎస్.రాజబాబులకు పలువురు విద్యుత్ ఉద్యోగులు అభినందనలు తెలిపారు.



దైవప్రసాద్



సులేఖరాణి

గుణుపూర్ పాసింజర్‌కు అదనపు కోచ్

తాటిచెట్లపాలెం: దసరా వేళ ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖపట్నం–గుణుపూర్–విశాఖపట్నం పాసింజర్‌కు అదనంగా జనరల్ క్లాస్ కోచ్‌ను తాత్కాలికంగా జతచేస్తున్నారు. గురువారం నుంచి ఈ నెల 5వ తేదీ వరకు ఈ సదుపాయం ఉంటుందని, ప్రయాణికులు వినియోగించుకోవాలని రైల్వే అధికారులు కోరారు.

నేటి నుంచి ఖాదీ సంత

ఎంవీపీకాలనీ: బీజేపీ ఆధ్వర్యంలో గురు,శుక్రవారాల్లో బీచ్‌రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్‌హాల్ ఎదురుగా ఖాదీ సంతను నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు తెలిపారు. బుధవారం లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని 'ప్రతి ఇంటా స్వదేశీ, ఇంటింటా స్వదేశీ' అనే నినాదంతో స్వదేశీ వస్తువుల తయారీదారులను ప్రోత్సహించడానికి ఈ సంతను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సంత ద్వారా చేనేత, హస్తకళాకారుల ఉత్పత్తుల విక్రయాలకు, ప్రోత్సాహానికి అవకాశం కల్పించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కోశాధికారి నాగేంద్ర, రాష్ట్ర అధికార ప్రతినిధి సుహాసిని ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



ఖాదీ సంత పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పరశురామరాజు తదితరులు

వృద్ధులను గౌరవించడం మన బాధ్యత



సత్కారం పొందిన వృద్ధులతో ఎమ్మెల్యే పల్లా తదితరులు

గాజువాక: వృద్ధాప్యంలో ఉన్నవారిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక క్లబ్, వరిష్ఠ పౌరుల సమాఖ్య, లైన్స్ క్లబ్, వాయిస్ ఆఫ్ గాజువాక ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ప్రపంచ వృద్ధుల దినోత్సవం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పెద్దలంటే తనకు ఎంతో గౌరవం, అభిమానం అన్నారు. వారి నుంచి ఎంతో నేర్చుకోవాల్సి ఉంటుందన్నారు. వృద్ధుల దినోత్సవం అనడం కన్నా ఎల్డర్స్ డే అని పిలిస్తే బాగుటుందన్నారు. ఈనాటి యువత ఎంత బిజీగా ఉన్నా తాత, బామ్మలను కాపాడుకొని భవిష్యత్ తరాలు ఎలా మెలగాలో తెలుసుకోవాలన్నారు. 75 ఏళ్లు దాటిన వృద్ధులను ఈ సందర్భంగా సత్కరించారు. సౌత్ ఏసీపీ వై.శ్రీనివాసరావు, కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, ఆర్కే హాస్పిటల్ ఎండీ వేమూరి కృష్ణమూర్తి, నిర్వాహక సంఘాల ప్రతినిధులు చిక్కా సత్యనారాయణ, ఎస్.వి.రమణరాజు, నున్న శ్రీనివాసరావు, టి.వి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.